నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 1 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI


## దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా సులోచన

- మహేందర్‌కుమార్ నుంచి బాధ్యతల స్వీకరణ



ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ ఏసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అన్నెపర్తి సులోచన

రామగిరి, జూలై 31: ఉమ్మడి నల్లగొండ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా అన్నెపర్తి సులోచన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఆ స్థానంలో ఇక్కడ పనిచేసిన కె.మహేందర్‌కుమార్ పదవి విరమణ పొందడంతో ఖమ్మంలో ఏసీగా విధులు నిర్వహిస్తున్న సులోచనను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. సులోచన గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏసీగా సుదీర్ఘకాలం పని చేశారు. ప్రముఖ శైవక్షేత్రం చెర్వుగుట్ట పార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈఓగా పని చేస్తుండగా ఖమ్మం జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. తిరిగి సాధారణ బదిలీల్లో భాగంగా నల్లగొండ జిల్లాకు వచ్చారు. ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి, అర్చక, ఉద్యోగుల అభ్యున్నతికి సహకారం అందిస్తానని ఆమె తెలిపారు.

## ఆడబిడ్డలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి

- దివ్యాంగురాలిపై అత్యాచారం దురదుష్టకరం
- అసెంబ్లీలో శాలిగౌరారం ఘటనను ప్రస్తావించిన మాజీ మంత్రి కేటీఆర్

శాలిగౌరారం, జూలై 31 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం శాలిలింగోటం గ్రామంలో దివ్యాంగురాలిపై లైంగింక దాడి దురదుష్టకరమైన ఘటన అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఆడబిడ్డలకు ప్రత్యేకమైన రక్షణ కల్పించాలని బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, హత్యలు, మహిళల పట్ల, అత్యాచారాలు జరుగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రుణమాఫీపై సందేహాలెన్నో!



## రూ.లక్షన్నరలోపు ఉన్నా పేర్ల గల్లంతు

రెండో విడత రుణమాఫీలోనూ స్పష్టత కరువైంది. ఎవరికి రుణమాఫీ వర్తించింది.. వర్తించకపోతే ఎందుకు వర్తించలేదు.. దానికి కారణాలేంటన్న దానిపై రైతుల్లో ఎన్నో సందేహాలు నెలకొన్నాయి. పైకి ప్రభుత్వం చెప్పున్న దానికి క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేక పోవడం మరింత గందరగోళానికి దారితీస్తున్నది. ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింప చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పదేపదే మీడియా ఎదుట చెప్తున్నారు. గ్రౌండ్ లెవల్‌లో మాత్రం కుటుంబం ప్రతిపాదికనే రుణమాఫీ చేస్తున్నట్లు స్పష్టమవుతున్నది. దాంతో రైతుల్లో తీవ్ర ఆయోమయం నెలకొని బ్యాంకు ఉద్యోగులతోపాటు వ్యవసాయ శాఖ అధికారులతో వాదనకు దిగుతున్నారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా బ్యాంకులు, సొసైటీలు పెద్ద సంఖ్యలో రైతులతో కిక్కిరిసిపోయాయి. రుణమాఫీ జాబితాలో తాము న్నామో, లేమో తెలుసుకునేందుకు రైతు క్యూ కట్టారు.

– నల్లగొండ ప్రతినిధి, జూలై31(నమస్తే తెలంగాణ)

- బ్యాంకులు, సొసైటీల చుట్టూ రైతుల చక్కర్లు
- రేషన్‌కార్డు లేని వారికి ప్రస్తుతం లేనట్లే
- ఆధార్ కార్డు లింకేజీలో తప్పుల వల్ల తిప్పలే
- భారీగా తగ్గిపోయిన లబ్ధిదారుల సంఖ్య
- ప్రభుత్వ కొర్రీలపై రైతుల తీవ్ర ఆగ్రహం




నల్లగొండలోని యూనియన్ బ్యాంక్‌లో రుణమాఫీ హెల్ప్ డెస్క్ వద్ద బారులుదీరిన రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలి విడుత లక్ష రూపాయల రుణమాఫీ ఇంకా పూర్తి కాలేదు. దీనిపై రైతుల నిలదీతలు, అధికారుల వివరణలు ఓ వైపు కొనసాగుతుండగా, మరోవైపు రెండో విడత రుణమాఫీలో లక్షన్నర వరకు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడుత మాదిరిగానే రెండో విడతలోనూ కుటుంబం ఆధారంగానే రుణమాఫీని వర్తింప చేసింది. రేషన్ కార్డు ప్రమాణికంగా ఒక కుటుంబంలో ఎంత మంది సభ్యులు రుణం తీసుకున్నా గరిష్టంగా లక్షన్నర వరకు మాఫీ చేశారు. దాంతో రుణం తీసుకున్న ప్రతి ఒక్కరికీ మాఫీ కాలేదన్న అసంతృప్తిలో రైతులు కనిపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో విడుతలో మొత్తం 82,020 కుటంబాలకు గానూ రూ.947.43 కోట్ల రుణాలు మాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దాంతో రెండు విడుతల్లో కలిపి కూడా ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,57,162 మంది రైతులకు గానూ రూ.1,880.25 కోట్లు మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి. వాస్తవానికి ప్రభుత్వం చెప్పిన విధంగా పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ అమలు చేస్తే ఐదు లక్షల మంది రైతుల వరకు లబ్ధిదారులుగా ఉంటారని అంచనా. ప్రభుత్వం కొర్రీల వల్ల కనీసం రెండు లక్షల మంది అర్హులైన రైతులు రుణమాఫీకి దూరమవుతున్నట్లు అనధికారిక అంచనా.

రేషన్ కార్డు ప్రమాణికంగా తీసుకోవడంతో కుటుంబానికి గరిష్ట లబ్ధి రెండు లక్షలే కలుగనుంది. ఇక రేషన్‌కార్డులు లేని వారికి ప్రస్తుతం రుణమాఫీ వర్తించడం లేదు. తర్వాత గ్రామాలకు వచ్చి అధికారులు విచారణ జరిపి రుణమాఫీ చేస్తామని అధికారులు చెప్తున్నారు. ఇదే సమయంలో ఆధార్ కార్డులను, బ్యాంకు అకౌంట్లు, పాస్‌పుస్తకాలతో లింక్ చేసే క్రమంలో జరిగిన పొరపాట్లతోనూ కొందరు రుణమాఫీకి దూరం అవుతున్నారు. వాటిని సరిచేసే వ్యవస్థ నేటికీ అందుబాటులోకి రాకపోవడంతో సంబంధిత రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

### డీసీసీబీలో 20శాతం మంది దూరంగా...

నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అర్హులైన రైతుల్లో లక్షన్నర రుణమాఫీకి 20 శాతం మంది దూరం అవుతున్నట్లు అంచనా. వాస్తవంగా డీసీసీబీ పరిధిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 23వేల మంది వరకు లక్షన్నర రుణమాఫీకి అర్హులుగా బ్యాంకు అధికారులు అంచనా వేశారు. వారిలో 80శాతం మంది రుణమాఫీ పరిధిలోకి వస్తున్నట్లు అనధికారిక సమాచారం. వారి కోసం రూ.95కోట్లు రుణమాఫీ కింద జమ అయినట్లు తెలిసింది. డీసీసీబీ పరిధిలో తొలి దశలోనూ మొత్తం 72వేల మంది రూ.316కోట్ల వరకు లక్ష రుణమాఫీకి అర్హులుగా ఉన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తే అందులో 33,913 మంది కోసం రూ.143 కోట్ల రుణమాఫీ మాత్రమే వచ్చింది. రెండో దశలోనూ అలాగే కోతలు పడడంతో సొసైటీల్లోనూ రైతుల్లో ఆందోళన నెలకొంది. వీటిపై వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ప్రభుత్వం చెబుతున్నా వారి వద్ద కూడా సరైన సమాధానం లభించడం లేదన్నది మెజార్టీ రైతుల అభిప్రాయం.



నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో బారులుదీరిన రైతులు

### జిల్లా కార్యాలయానికి రైతుల క్యూ

రుణమాఫీ కాని రైతులు ఎందుకు కాలేదో తెలుసుకునేందుకు నల్లగొండలోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి తరలివస్తున్నారు. బుధవారం పెద్ద సంఖ్యలో రైతులు కార్యాలయం వద్ద గుమిగూడారు. ఇందులో రేషన్ కార్డు లేకపోవడం వల్ల కొందరికి, ఆధార్ సీడింగ్‌లో తప్పుల వద్ద కొందరికి, ఒకే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి రుణాలు ఉండడం వల్ల మరి కొందరికి రుణమాఫీ వర్తించ లేదని అధికారులు చెప్పారు. పైకి అందరికీ రుణమాఫీ అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తుంటే.. ఇక్కడికి వచ్చాక రేషన్‌కార్డు ఆధారమని అధికారులు ఎలా చెప్తారని రైతులు నిలదీస్తున్నారు. గతంలో కేసీఆర్ సర్కారు చేసిన మాదిరిగానే అందరికీ భేషరతుగా రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీ!

- ప్రాథమికంగా ప్రభుత్వ నిర్ణయం
- ఇటీవల రాష్ట్రానికి మంజూరు చేసిన కేంద్రం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- హ్యాండ్లూమ్ పార్కులో ఏర్పాటుకు సన్నాహాలు
- ఇక మన దగ్గరే చేనేత పరిశోధనలు, అధ్యయనాలు
- నాడు ఐఐహెచ్‌టీ కోసం మాజీ మంత్రి కేటీఆర్ కృషి




యాదాద్రి భువనగిరి, జూలై 31 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) భూదాన్ పోచంపల్లికి రానున్నది. ఇటీవల కేంద్రం రాష్ట్రానికి మంజూరు చేయగా, పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వచ్చే విద్యా సంవత్సరం కళాశాల ప్రారంభం కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఐఐహెచ్‌టీ అందుబాటులోకి వస్తే అనేక విధాలుగా మేలు జరగడంతోపాటు పోచంపల్లి మరింత ప్రఖ్యాతి పొందనున్నది.

ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా పని చేస్తున్న ప్రపంచ పర్యాటక సంస్థ నిర్వహించిన బెస్ట్ టూరిజం విలేజ్ పోటీల్లో భూదాన్ పోచంపల్లి ఉత్తమ పర్యాటక ప్రాంతంగా ఎంపికైంది. చేనేత పరిశ్రమకు ఇది పెట్టింది పేరు. పోచంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఎన్నో విజ్ఞప్తులు, వినతులు కేంద్రానికి వెళ్లాయి. దేశ వ్యాప్తంగా పది ఐఐహెచ్‌టీలు ఉన్నా అత్యధికంగా నేత కార్మికులు ఉన్న తెలంగాణలో మాత్రం ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. ఇంత కాలానికి రాష్ట్రానికి కేంద్రం ఐఐహెచ్‌టీని మంజూరు చేసింది. ఏర్పాటు విషయంలో పోచంపల్లితోపాటు గద్వాల పేరు ప్రముఖంగా వినిపించగా, ఇటీవల పోచంపల్లికే ఇవ్వాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

### వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం..

వాస్తవానికి మార్చిలోనే రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ మంజూరైంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకంతో అది ముందుకు పడడం లేదు. సంస్థ మంజూరైన వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తే ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమయ్యేవి. కానీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఫస్ట్ బ్యాచ్‌లో 75మంది విద్యార్థులతో ప్రారంభించే అవకాశం ఉంది. విద్యా సంస్థ ఏర్పాటు, నిర్వహణ, టీచింగ్, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ నియామకం వంటివి రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవాల్సి ఉంటుంది. అంతకంటే ముందు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పలు విషయాలతో కూడిన డీపీఆర్ అందించాల్సి ఉంది. దేశంలోనే అన్ని సంస్థలకు సంబంధించి నిధులు కేంద్రం సమకూరుస్తుండగా, తెలంగాణ ఐఐహెచ్‌టీ మాత్రం తెలంగాణే చూసుకోవాలని తిరకాసు పెట్టినట్లు సమాచారం.

### పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కుకు మరమ్మతులు..

పోచంపల్లి మండలం కనుముక్కుల పరిధిలోని హ్యాండ్లూమ్ పార్క్ నిరుపయోగంగా ఉంది. కార్మికులకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో 23 ఎకరాల్లో ఏర్పాటైన ఈ పార్కు పెట్టుబడి, సరైన నిర్వహణ లేక మూతపడింది. కార్మికుల సంక్షేమ కోసం గతేడాది దీన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.12.5 కోట్లతో కొనుగోలు చేసింది. ఇందులోనే కాలేజీ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. మరమ్మతులు చేయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు. కాలేజీకి అనుగుణంగా రిపేర్లు చేయనున్నట్లు సమాచారం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.13 కోట్లు అవసరమని ఓ అంచనాకు వచ్చారు. వచ్చే ఏడాది వరకు పోచంపల్లిలో వీలు పడకపోతే తాత్కాలికంగా హైదరాబాద్‌లో ఐఐహెచ్‌టీ ప్రారంభించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

### నాడు మాజీ మంత్రి కేటీఆర్ ఎనలేని కృషి..

భూదాన్‌పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీని నెలకొల్పాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో అన్ని వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి అప్పట్లో పలుమార్లు ప్రతిపాదనలు పంపించింది. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ సైతం తన వంతు ప్రయత్నాలు చేశారు. అనేక సార్లు ఢిల్లీలో కేంద్ర మంత్రులకు స్వయంగా లేఖలు అందించి విజ్ఞప్తులు చేశారు.

### మన దగ్గరే పరిశోధనలు, అధ్యయనాలు..

పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే టెక్నికల్ డిగ్రీ, డిప్లొమాలను ఇక్కడి నుంచే పొందే అవకాశం కలుగుతుంది. చేనేత, జౌళి, డిప్లమా డిగ్రీ, పీజీ కోర్సులతోపాటు పరిశోధన, అభివృద్ధి అధ్యయనాలు జరుగుతాయి. రెగ్యులర్ శిక్షణతోపాటు టెక్నికల్ టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన చదువులు, టెక్స్‌టైల్ డిజైనింగ్, దుస్తుల డిజైనింగ్, మార్కెటింగ్, అంతర్జాతీయ వర్తకం వంటి అంశాల్లో బోధన అందుతుంది. ఆన్‌లైన్ చీరల వ్యాపారానికి యువతకు అవసరమైన మెలకువలు లభిస్తాయి. ముఖ్యంగా స్పిన్నింగ్, వీవింగ్, డిజైనింగ్, డైయింగ్, ప్రింటింగ్, గార్మెంట్ మేకింగ్, మార్కెటింగ్ మేనేజ్మెంట్ అంశాల్లో సాంకేతిక పద్ధతుల్లో శిక్షణ ఇస్తారు.



కెనరా బ్యాంక్‌లో రైతుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

## రైతులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భూదాన్‌పోచంపల్లి, జూలై 31 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ రైతులకు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు వారి రుణాలను రెన్యువల్ చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలోని కెనరా బ్యాంక్‌ను ఆ యన సందర్శించారు. రుణమాఫీకి సంబంధించిన లబ్ధిదారు ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు రుణమాఫీ ప్రక్రియలో కీలకపాత్ర పోషించాలన్నారు. రుణమాఫీలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే రైతులు తమ ఆధార్ వివరాలతో అధికారులను సంప్రదించాలని, టోల్ ఫ్రీ నంబర్ 08685 -293312ను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోచంపల్లి మార్కండేయనగర్‌లోని ఆదర్శ పాఠశాలను సందర్శించి అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, కమిషనర్ వీరారెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీఖాన్, ఏఈఓలు శ్వేత, శిరీష, కెనరా బ్యాంక్ అధికారులు ఉన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

నీలగిరి జులై 31 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు బదిలీ అయ్యింది. మొత్తం 12 మంది సబ్ రిజిస్ట్రార్లు, ఇద్దరు మినిస్ట్రీయల్ ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. నల్లగొండ ఏఆర్‌సీగా పని చేస్తున్న గోవర్ధన్‌కు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి జూనియర్ అసిస్టెంట్‌గా, ఎంవీ ఆడిట్‌లో పని చేస్తున్న మధుకర్‌కు ఏఆర్సీకి బదిలీ అయ్యింది. భువనగిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీనును చండూరుకు, నకిరేకల్ సబ్ రిజిస్ట్రార్ అన్వేషితను జనగాం, చౌటుప్పల్ సబ్ రిజిస్టర్ సాయివికాస్‌ను దేవరకొండ, చండూరు సబ్ రిజిస్టర్ అనూషను యాదగిరిగుట్ట, నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డి హుజూర్‌నగర్, యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కిశోర్ కొడకండ్ల, దేవరకొండ సబ్ రిజిస్ట్రార్ సందీప్ చౌటుప్పల్, కోదాడ సబ్ రిజిస్ట్రార్ అశోక్ మోత్కూరుకు, మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ అరవింద్ కోదాడ, రామన్నపేట సబ్ రిజిస్ట్రార్ నగేష్ నల్లగొండ సబ్ రిజిస్ట్రార్-2, నల్లగొండ రిజిస్ట్రార్-2 అలివేలు మంగమ్మ నల్లగొండ ఎంవీ ఆడిట్, బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ బలరామ్ మిర్యాలగూడ, ఘనపూర్ సబ్ రిజిస్ట్రార్ నరేశ్ బీబీనగర్ బదిలీ అయ్యారు.

# సాగునీటి కోసం ఎదురుచూపులు

## శ్రీశైలం నుంచి సాగర్‌కు పోటెత్తుతున్న వరద

- ముందస్తుగా నీటి విడుదల కోసం రైతుల డిమాండ్
- నారుమడులు పోసుకోవడానికి రైతుల ప్రయత్నాలు
- ఏఎమ్మార్పీ పరిధిలో చెరువులు నింపాలంటున్న రైతులు



నాగార్జునసాగర్ జలాశయం

నల్లగొండ ప్రతినిధి, జూలై31(నమస్తే తెలంగాణ)/మిర్యాలగూడ/ పీఏపల్లి: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో సాగర్ ఆయకట్టు రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. అక్టోబర్ వరకు కృష్ణానదిలో వరదలు వచ్చే అవకాశం ఉండడంతో ఇప్పటికే ఎగువన ఉన్న అన్ని ప్రాజెక్టులు నిండడంతో ఇక మిగిలింది సాగర్ ప్రాజెక్టే. కాబట్టి వచ్చే ప్రతి నీటి చుక్క సాగర్‌కే రానున్న నేపథ్యంలో ముందస్తుగానే సాగునీటి విడుదల కోసం రైతుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది వర్షాభావ పరిస్థితులతో యాసంగిలో పంటలకు నీరివ్వలేదు. వానకాలంలోనూ వేసిన పంటలను కాపాడేందుకు ఉన్న నీటినే పొదుపుగా వాడుకునేలా అప్పటి కేసీఆర్ సర్కార్ సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడింది. వరుసగా రెండు పంటలు సరిగ్గా పండని నేపథ్యంలో ప్రస్తుతం వస్తున్న వరదలపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు.

ఈ సీజన్‌లో కనిష్టంగా నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 503 అడుగులకు పడిపోయింది. శ్రీశైలం నుంచి వస్తున్న వరద ఉధృతితో బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి సాగర్‌లో నీటిమట్టం 526.80అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 2.18లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. దీంతో వేగంగా సాగర్ నీటిమట్టం పెరుగుతున్నది. ఇప్పటికే కుడి కాల్వ ద్వారా 5,944 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ఎడమకాల్వతో పాటు ఏఎంఆర్‌పీ ఆయకట్టుకు సైతం నీటిని విడుదల చేయాలని గత రెండుమూడు రోజులుగా రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఎగువ నుంచి భారీ వరద వస్తున్నందున ముందుగానే నీటిని విడుదల చేయడం వల్ల సకాలంలో నారుమళ్లు పోసుకుంటామని ఎడమకాల్వ పరిధిలోని రైతులు కోరుతున్నారు. ఎడమకాల్వకు నీటిని వదిలితే ఆ పరిధిలోని చెరువులు, కుంటలు కూడా నిండనున్నాయి. దీంతో బోర్లు, బావుల్లోకి నీరు వచ్చినా సరే ఆ నీటితోనైనా నారుమళ్లు సిద్ధం చేసుకోవచ్చని రైతులు భావిస్తున్నారు. ఇక ఇదే సమయంలో ఏఎంఆర్‌పీ ఆయకట్టు పూర్తిగా చెరువులు, కుంటలపైనే ఆధారపడి ఉంటుంది. ఇక్కడ చెరువులు నింపడం వల్ల భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీరు అందుబాటులోకి రానుంది. దీని ద్వారా వరి పంటతో పాటు తోటలకు ఉపయుక్తం కానుంది.

### ఏఎమ్మార్పీ పరిధిలో...

సాగర్ జలాలపై ఆధారపడిన ఏఎమ్మార్పీ ద్వారా తాగునీటి కోసం ప్రధానకాల్వ వెయ్యి క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. మిగతా అన్ని డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల నిలిపేశారు. ఆయకట్టు పరిధిలోని 55 డిస్ట్రిబ్యూటరీలతో పాటు 90 పైగా చెరువుల కింద సాగు చేసే రైతులు ఈ సీజనులో సాగుకు సన్నద్ధం అవుతున్నారు. గత యాసంగిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు కొరవడడంతో ప్రాజెక్టు పరిధిలో ఒక్క చెరువు కూడా నింపలేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటి బావులు, బోర్లు ఎండిపోయి వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ఏండ్ల తరబడి పెంచుకున్న తోటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఈ నేపథ్యంలో ప్రస్తుత సాగర్‌కు వరద పోటెత్తుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం ఏఎమ్మార్పీ ద్వారా రెండు మోటర్లద్వారా 900 క్యూసెక్కులు విడుదల చేస్తూ ఏకేబీఆర్ నుంచి 1000 క్యూసెక్కులు ప్రధాన కాల్వ నల్లగొండ తాగు నీటి కోసం తరలిస్తున్నారు. తాగునీటితో పాటు చెరువులు, కుంటలు నింపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై మంగళవారం కనగల్‌కు చెందిన కొందరు రైతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి కూడా చేశారు.

### నారు పోసే సమయం

గత వానకాలం, యాసంగిలో ఎడమకాల్వ కింద సాగునీటి విడుదల లేకపోవడంతో రైతులు ఈ వానకాలం సాగుకు నీరు వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. అందుకు అనుగుణంగా కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. ఇక వానకాలం సాగుకు రంది లేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఎడమకాల్వ కింద 2,81,683 ఎకరాలు ఉండగా 42 ఎత్తిపోతల పథకాల కింద 86,641 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం 3,68,324 ఎకరాల ఆయకట్టు ఉంది. వరద ప్రవాహం ఇదేవిధంగా కొనసాగితే మరో వారం రోజుల్లో సాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండుతుందని అధికారులు పేర్కొంటున్నారు. వానకాలం నాట్లు వేసే సీజన్ ఆగస్టు నెల మొత్తం ఉండడంతో వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఆయకట్టు కింద సాగు చేసుకునేందుకు నారుమడులు పోయాల్సి ఉందని, నారుమడులు పెంచడం కోసం వెంటనే నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం నార్లు పోసుకునే సమయమని, ఈ వారంలో నీరు వదిలితే ఆగస్టు నెలలో నార్లు వేసుకోవచ్చని రైతులు భావిస్తున్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఎడమ కాల్వకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### నీళ్లు వదిలితే నారు పోసుకుంటాం...



సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు పుష్కలంగా వస్తున్నందున ఎడమ కాల్వ ఆయకట్టుకు ప్రభుత్వం నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలి. నార్లు పోసుకొని వానకాలం సాగుకు సిద్ధం అవుతాం. గతేడాది వానకాలం, యాసంగిలో వరిసాగుకు ఎడమకాల్వ ద్వారా నీటిని వదలకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాం. నీళ్లు అందక పొలాలు ఎండిపోయినయి.

-గుగులోతు స్వామి, రైతు, జిలకరకుంట తండా, అడవిదేవుపల్లి మండలం, నల్లగొండ జిల్లా

### వెంటనే సాగర్ నీటిని వదలాలి



వరుణుడు కరుణించడం వల్ల మంచి సమయానికే నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతున్నది. ఈ వారం రోజుల్లో వరినార్లు పోసుకొని నాటు వేసుకునేందుకు దుక్కులు సిద్ధం చేసుకుంటాం. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వరినాట్లు వేసుకుంటే పంటల దిగుబడి కూడా అధికంగా వస్తుంది. సాగర్ ప్రాజెక్టుకు వరద భారీగా వస్తున్నందున ప్రభుత్వం వెంటనే ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి.

-ధీరావత్ మేష్యానాయక్, రైతు, నర్సాపురం, దామరచర్ల మండలం, నల్లగొండ

### ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపాలి



ఏఎంఎంఆర్‌పీ కాల్వల ద్వారా కనగల్ మండల పరిధిలో ఉన్న చెరువులను నింపాలి. మండలంలో అధిక శాతం వ్యవసాయం చెరువులు బోర్ల ద్వారా సేద్యం చేస్తున్నారు. గత యాసంగి నుంచి చెరువుల్లో నీళ్లు లేక పోవడంతో బోర్లు అడుగంటి పెద్ద మొత్తంలో పొలాలు ఎండి పోయినయి. రైతులు అప్పుల పాలయ్యారు. ఏఎంఆర్‌పీ ద్వారా చెరువులు నింపితే బోర్లకు ఇబ్బంది ఉండదు. శ్రీశైలం ద్వారా సాగర్‌కు నీరు వస్తునందున ప్రభుత్వం కాల్వలకు నీటిని విడుదల చేయాలి.

-మాజీ ఎంపీపీ కరీంపాషా, కనగల్, నల్లగొండ జిల్లా